సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం । 22 । అక్టోబర్ । 2023



సోమశిలలో 30.483 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో శనివారం సాయంత్రానికి 30.483 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయానికి పైతట్టు ప్రాంతాల నుంచి 191 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.62,690
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.5,660
3శాతం జీఎస్టీతో	రూ.5,830
నవర (8గ్రా)	రూ.46,640

గరిష్టం/కనిష్టం
35.6 /26.8

వాతావరణం

శనివారం గాలిలో తేమ 62 శాతం ఉంది. ఆదివారం జిల్లాలో ఉష్ణోగ్రతలు, ఎండతీవ్రత సాధారణంగా ఉండే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

క్లెయిమ్‌లు జాగ్రత్తగా పరిష్కరించాలి

- కలెక్టర్ ఎం.హరినారాయణన్



మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): ఓటర్ల జాబితా సమ్మరీ రివిజన్‌లో వచ్చిన క్లెయిమ్‌లు, ఫామ్స్ పరిష్కారంలో జాగ్రత్తగా వ్యవహరించాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ ఈఆర్‌ఓ, ఏఈఆర్‌లకు సూచించారు. ఓటర్ల జాబితా సమ్మరీ రివిజన్‌పై శనివారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, ఎలక్షన్ డీటీలతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 27వ తేదీన డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను ప్రచురించాలన్నారు. పోలింగ్ స్టేషన్ల వారీగా క్లెయిమ్‌లు పరిశీలించాలని తెలిపారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఓటర్లకు అవగాహన కల్పించేందుకు నవంబర్ 4, 5 తేదీల్లో, డిసెంబర్ 2, 3 తేదీల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలని సూచించారు. ఈ రోజుల్లో పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్‌ఓలు ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించాలని తెలిపారు. మిగిలిన రోజుల్లో కళాశాలలు, మాల్స్, ఫ్యాక్టరీలు, మార్కెట్లు తదితర ప్రాంతాల్లో క్యాంపెయిన్ నిర్వహించి ఓటర్లుగా చేర్చాలన్నారు. వచ్చిన దరఖాస్తులు, ఫామ్స్‌ను డిసెంబర్ 26వ తేదీ లోపు పరిష్కరించాలన్నారు. వచ్చే ఏడాది జనవరి 5న తుది ఓటర్ల జాబితా ప్రచురించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆర్.కూర్మనాథ్, మున్సిపల్ కమిషనర్ వికాస్ మర్మత్, డీఆర్వో వెంకటనారాయణమ్మ, కందుకూరు సబ్ కలెక్టర్ శోభిక తదితరులు పాల్గొన్నారు.

రేపటి 'జగనన్నకు చెబుదాం' రద్దు

నెల్లూరు(దర్గామిట్ట): దసరా పండగ సందర్భంగా సోమవారం ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు కావడంతో జిల్లాలో జరగాల్సిన జగనన్నకు చెబుదాం కార్యక్రమం ఆ రోజు రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ ఎం.హరినారాయణన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30న ఈ కార్యక్రమం యథావిధిగా జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ నెల 25న అల్లూరులో జరగాల్సిన జగనన్నకు చెబుదాం కార్యక్రమం వాయిదా పడిందని, మళ్లీ ఎప్పుడు నిర్వహిస్తామో తెలియజేస్తామని కలెక్టర్ తెలిపారు.

విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి

- జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, వేదికపై ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు(పొగతోట): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికి పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పేర్కొన్నారు. శనివారం నెల్లూరులోని జెడ్పీ సమావేశ మందిరంలో ఎంఈఓలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. విద్య, వైద్యం అన్నివర్గాల ప్రజలకు అందేలా ముఖ్యమంత్రి చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ స్కూళ్లను తలదన్నేలా ఉన్నాయని, పూర్తిస్థాయిలో వసతులు కల్పించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. నాడు–నేడు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎమ్మెల్సీ పి.చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ప్రభుత్వ పాఠశాలలను ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందన్నారు. ఎంఈఓలకు వాహనాలు ఏర్పాటు చేయించేలా ప్రభుత్వంతో చర్చిస్తామన్నారు. అంతకుముందు జెడ్పీ చైర్‌పర్సన్‌ను విద్యాశాఖ అధికారులు ఘనంగా సన్మానించారు.

విద్యుత్ సేవలు మరింత చేరువై

రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ సేవలను ప్రజలకు మరింత చేరువలోకి తీసుకువచ్చింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన గ్రామ, వార్డు సచివాలయాల్లో ఈ సేవలను అందించేందుకు చర్యలు తీసుకున్నారు. ఇప్పటి వరకు విద్యుత్ బిల్లుల చెల్లింపులతోపాటు పలు సేవలను వినియోగదారులు మీసేవ కేంద్రాల్లో పొందేవారు. ప్రస్తుతం 14 రకాల విద్యుత్ సేవలను వినియోగదారులు తమ ఇంటికి సమీపంలోనే ఉన్న సచివాలయాల్లో పొందేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

సచివాలయాల్లోనే 14 రకాల సేవలు

- విద్యుత్ సంస్థకు, వినియోగదారులకు వారధిగా 577 మంది ఎనర్జీ అసిస్టెంట్లు
- త్వరితగతిన విద్యుత్ సమస్యల పరిష్కారం



నెల్లూరులోని ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా ప్రధాన పరిపాలనా కార్యాలయం విద్యుత్ భవన్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): గతంలో పలు విద్యుత్ సేవల కోసం వినియోగదారులు సంబంధిత విద్యుత్ సెక్షన్ కార్యాలయానికి గానీ, విద్యుత్ సబ్‌స్టేషన్‌లకు కానీ, అసిస్టెంట్ ఇంజినీర్ కార్యాలయాలకు గానీ, మీసేవ కేంద్రాలకు గానీ వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం 14 రకాల విద్యుత్ సేవలను గ్రామ, వార్డు సచివాలయాల్లోనే అందించేలా నిర్ణయం తీసుకోవడంతో వినియోగదారులకు మరింత సౌకర్యవంతమైంది. అంతేకాక విద్యుత్ సంబంధిత ఫిర్యాదులను కూడా సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న ఎనర్జీ అసిస్టెంట్ల దృష్టికి తీసుకెళ్లి సత్వరమే పరిష్కరించుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. పట్టణాల్లో మినహా గ్రామాల్లో అయితే విద్యుత్ బిల్లులను కూడా గ్రామ సచివాలయాల్లో చెల్లించేలా చర్యలు తీసుకుంది. తద్వారా జిల్లా సర్కిల్ పరిధిలో 11 లక్షల మంది విద్యుత్ వినియోగదారులు ఈ సేవలను వినియోగించుకునే అవకాశం కలిగింది.

ఎనర్జీ అసిస్టెంట్లకు బాధ్యతలు

సచివాలయాల కేంద్రంగా వినియోగదారులకు, విద్యుత్ సంస్థకు మధ్య వారధిగా ఎనర్జీ అసిస్టెంట్లు (గ్రేడ్–2 జేఎల్‌ఎం) కీలక పాత్ర పోషిస్తూ పట్టణాలు, గ్రామాల్లో విద్యుత్ అంతరాయాలు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఏపీఎస్పీడీసీఎల్ ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్కిల్ పరిధిలో 577 మంది ఎనర్జీ అసిస్టెంట్లు విద్యుత్‌శాఖకు సంబంధించి విధులు నిర్వహిస్తున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో ఎనర్జీ అసిస్టెంట్లకు కొన్ని విద్యుత్ సర్వీసులకు సంబంధించి బాధ్యతలు అప్పగించారు. వీరు వినియోగదారులకు నిత్యం అందుబాటులో ఉంటూ 5–10 కిలోమీటర్ల పరిధిలో ఉన్న విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లను పర్యవేక్షించేలా విధులు కేటాయించారు. విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను గుర్తించి తొలగించడం, విద్యుత్ జంపర్లు తెగిన సమయంలో వాటిని పునరుద్ధరించడం, ట్రాన్స్‌ఫార్మర్లలో తలెత్తిన సమస్యలను పరిష్కరించడం, ఆగిపోయిన మీటర్ల స్థానంలో కొత్త మీటర్లు ఏర్పాటు చేయడం తదితర సేవలు అందిస్తూ సమస్యలు తలెత్తిన సందర్భాల్లో వాటిని పరిష్కరించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేలా విధులు కేటాయించారు. విద్యుత్ సరఫరాకు సంబంధించిన సమస్యలపై వినియోగదారులు, వలంటీర్లు సచివాలయాల్లో ఫిర్యాదు చేస్తే అతి తక్కువ వ్యవధిలో సమస్యను గుర్తించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నారు. తద్వారా విద్యుత్ సమస్యలు ఎక్కడికక్కడే పరిష్కారం కావడంతోపాటు పలు రకాల విద్యుత్ సేవలు సచివాలయాల ద్వారా అందుతున్నాయి.



వినియోగదారులకు మరింత సౌకర్యం



ఉమ్మడి జిల్లా సర్కిల్ పరిధిలో ఉన్న 577 మంది ఎనర్జీ అసిస్టెంట్లు గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉంటూ విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నారు. విద్యుత్ వినియోగదారులు సచివాలయాల ద్వారా మరిన్ని విద్యుత్ సేవలు పొందేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవకాశం కల్పించారు. ఇందుకు అవసరమైన సాంకేతిక ఏర్పాట్లను అన్ని సచివాలయాల్లో అందుబాటులోకి తీసుకువచ్చారు.

– వి.విజయన్, ఎస్ఈ, ఏపీఎస్పీడీసీఎల్ ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్కిల్

సచివాలయాల్లో అందే విద్యుత్ సేవలు

- గృహ, వాణిజ్య విద్యుత్ సర్వీసు కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.
- వ్యవసాయ విద్యుత్ సర్వీసు కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.
- అదనపు విద్యుత్ లోడ్ కోసం దరఖాస్తు అందజేయవచ్చు.
- విద్యుత్ సర్వీసుల్లో ఉన్న కేటగిరీలను మార్పు చేసుకునే సౌకర్యం.
- విద్యుత్ సర్వీసు కోసం పేరు మార్చుకునే సౌకర్యం.
- మీటర్ అధికంగా తిరుగుతుంటే విద్యుత్ మీటర్ టెస్టింగ్ చేసుకునే సౌకర్యం.
- కాలిపోయిన విద్యుత్ మీటర్ స్థానంలో నూతన మీటర్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.
- విద్యుత్ బిల్లులో వచ్చిన సమస్యలపై ఫిర్యాదు చేసుకునే సౌకర్యం.
- ట్రాన్స్‌ఫార్మర్లకు సంబంధించిన ఫిర్యాదులు చేయవచ్చు.
- హై ఓల్టేజీ, లో ఓల్టేజీ సమస్యలపై ఫిర్యాదు చేసే సౌకర్యం.
- విద్యుత్ లైన్లను మార్చడం కోసం ఫిర్యాదు చేయవచ్చు.
- స్తంభాలను మార్చేందుకు ఫిర్యాదు చేసే సౌకర్యం.
- విద్యుత్ మీటర్ ఆగిపోవడం, నెమ్మదిగా తిరగడం, వేగంగా తిరగడం వంటి సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చు.
- గ్రామాల్లో విద్యుత్ బిల్లుల చెల్లింపుల సౌకర్యం.

■ నేటి అలంకారం



■ దుర్గాదేవిగా అమ్మవారు

అయోడిన్ లోపంపై అవగాహన కల్పించండి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌ఓ తదితరులు

నెల్లూరు సిటీ: ప్రపంచ అయోడిన్ లోప రుగ్మతల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అయోడిన్ లోపంతో తలెత్తే అనర్థాలపై ఈ నెల 27వ తేదీ వరకు ప్రజలకు అవగాహన కల్పించేలా వారోత్సవాలు నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌ఓ పెంచలయ్య తెలిపారు. ఈ మేరకు శనివారం నెల్లూరులోని జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో అయోడిన్‌పై అవగాహనకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ సుధీర్‌కుమార్, వైద్యాధికారులు భాస్కర్, ప్రమోద్, దివ్య, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పోలీసుల సేవలు శ్లాఘనీయం






పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, వేదికపై కలెక్టర్ హరినారాయణన్, ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి, మేయర్ స్రవంతి, స్మృతి పరేడ్ నిర్వహిస్తున్న సిబ్బంది

- పోలీసుల సంక్షేమానికి పెద్దపీట
- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు(క్రైమ్): సమాజ రక్షణ కోసం పోలీసులు అలుపెరగకుండా విధులు నిర్వహించడం వల్లనే ప్రజలందరూ ప్రశాంతంగా జీవిస్తున్నారని, వారి సేవలు శ్లాఘనీయమని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. నెల్లూరులోని పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో శనివారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి కాకాణి మాట్లాడుతూ సమాజ రక్షణే ధ్యేయంగా 24 గంటలు విధి నిర్వహణలో ఉండే ఏకైక వ్యక్తి పోలీసు మాత్రమేనన్నారు. దేశ రక్షణ కోసం సరిహద్దుల్లో జవాన్లు విధులు నిర్వహిస్తుంటే సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు తమ ప్రాణాలను సైతం తృణప్రాయంగా అర్పిస్తున్నారన్నారు. పోలీసుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తగిన చర్యలు తీసుకున్నారని, వీక్లీ ఆఫ్ మంజూరు చేశారని తెలిపారు. జిల్లాలో ఎస్పీ, కలెక్టర్ ఆధ్వర్యంలో పోలీసులు సమర్థవంతంగా విధులు నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన శాంతిభద్రతలు అందిస్తున్నారన్నారు. కలెక్టర్ ఎం.హరినారాయణన్ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. విధి నిర్వహణలో ఎందరో పోలీసులు తమ ప్రాణాలను త్యాగం చేశారని, జిల్లాలో ఈ ఏడాది 18 మంది అసువులు బాసారని, వారందరికీ నివాళులర్పిస్తున్నామని తెలిపారు. ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి మాట్లాడుతూ సుస్థిర శాంతిభద్రతల కోసం పోలీసు సిబ్బంది నిరంతరం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహిస్తున్నారన్నారు. అమరుల కుటుంబాలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని తెలిపారు. అనంతరం దేశవ్యాప్తంగా ఈ ఏడాది మృతిచెందిన పోలీసు సిబ్బంది పేర్లను ఏఎస్పీ శ్రీనివాసరావు చదివి వినిపించారు. అమరవీరుల స్థూపం వద్ద మంత్రి కాకాణితోపాటు కలెక్టర్ హరినారాయణన్, ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ట్రెయినీ కలెక్టర్ వి.సంజనాసిన్హా, నగర మేయర్ పొట్లూరి స్రవంతి, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి, పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ చిరంజీవిరెడ్డి, ఏఎస్పీలు ప్రసాద్, శ్రీనివాసరావు, డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్సైలు, పోలీసు అధికారుల సంఘం నాయకులు, అమరవీరుల కుటుంబసభ్యులు పుష్పగుచ్ఛాలుంచి నివాళులర్పించారు. పోలీసు అమరవీరుల స్మృత్యర్థం స్మృతి పరేడ్‌ను నిర్వహించారు. మంత్రి, కలెక్టర్ చేతులమీదుగా బాధిత కుటుంబాలకు హ్యూమానిటీ కార్పస్ ఫండ్ కింద చెక్కులు, బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు. అనంతరం అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ పోలీసు పరేడ్ గ్రౌండ్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు పోలీసు అధికారులు ర్యాలీ నిర్వహించారు.



700 కిలోల వెండిపట్టీలతో అలంకారం

నెల్లూరు(బృందావనం): నెల్లూరు నగరంలోని స్టోన్‌హౌస్‌పేటలో శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో శనివారం అమ్మవారు శ్రీధనలక్ష్మి అలంకారంలో దర్శనమిచ్చారు. వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి మూలమూర్తిని, గర్భగుడిని 700 కిలోల వెండిపట్టీలతో ఉభయకర్తల ఆధ్వర్యంలో అలంకరించారు.

సీఎంకు కృతజ్ఞతలు

నెల్లూరు(పొగతోట): ప్రభుత్వ శాఖల్లో గత 20 సంవత్సరాలుగా పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ గెజిట్ విడుదల చేసినందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చేజర్ల సుధాకర్‌రావు, దేవిరెడ్డి రమణారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. శనివారం ఆ ఫెడరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సీఎం దసరా కానుకగా 10,700 కుటుంబాల్లో వెలుగులు నింపారని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ విడుదల చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో ఫెడరేషన్ నాయకులు పిల్లి హరీష్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, మల్లికార్జున, వెంకటేశ్వర్లు, రెహమాన్ పాల్గొన్నారు.

రాష్ట్ర వక్ఫ్ బోర్డు సభ్యుడిగా షఫీ

నెల్లూరు(లీగల్): నెల్లూరు బార్ అసోసియేషన్ సభ్యుడు, సీనియర్ న్యాయవాది పఠాన్ షఫీ అహ్మద్‌ను రాష్ట్ర వక్ఫ్ బోర్డు సభ్యుడిగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా షఫీ అహ్మద్‌కు పలువురు న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

డీసీసీబీ సీఈఓ బదిలీ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ) సీఈఓ శంకర్‌బాబు చిత్తూరు డీసీసీబీ జనరల్ మేనేజర్‌గా బదిలీ అయ్యారు. ఈ క్రమంలో నెల్లూరు డీసీసీబీలో జీఎంగా ఉన్న సరిత ఇన్‌చార్జి సీఈఓగా బాధ్యతలు స్వీకరించారు.

పనుల పూర్తిపై దృష్టి సారించండి

• డ్వామా పీడీ వెంకట్రావ్


మాట్లాడుతున్న వెంకట్రావ్

నెల్లూరు(పొగతోట): పంచాయతీరాజ్‌కు సంబంధించిన పనులను ఈ నెల 25లోపు పూర్తి చేయాలని డ్వామా పీడీ వెంకట్రావ్ ఆదేశించారు. నగరంలోని డ్వామా కార్యాలయం నుంచి ఏపీడీలు, ఏపీఓలు, పీఆర్ డీఈలు, ఏఈలతో శనివారం నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. పీఆర్‌కు సంబంధించి 16827 పనులను పూర్తి చేశామని, ఇందులో డీసీసీ పనులు 8131 ఉన్నాయన్నారు. వీటిలో 5616 పనులను క్లోజ్ చేయాల్సి ఉందని పేర్కొన్నారు. కోర్టు కేసుల విషయంలో ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రాధాన్య పనుల విషయమై దృష్టి సారించాలని కోరారు.

దర్గాలకు బస్సులు నడపాలని వినతి

ఆత్మకూరు రూరల్: ఆత్మకూరు నియోజకవర్గంలోని పలు ప్రార్థన మందిరాలకు ఆర్టీసీ బస్సులను నడపాలని పలువురు కోరారు. స్థానిక డిపోలో మేనేజర్ కరిమున్నీసా, చీఫ్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కల్పన ఆధ్వర్యంలో డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఏఎస్‌పేట, కసుమూరు దర్గాలకు ఆత్మకూరు నుంచి బస్సులు నడపాలని కోరారు.

నిమ్మ ధరలు (కిలో)
సన్నవి : రూ.25
పెద్దవి : రూ.65
పండ్లు : రూ.7





పండగ సందడి


వస్త్ర దుకాణంలో కొనుగోళ్ల సందడి

• షాపింగ్ మాళ్లు, పలు కంపెనీల ప్రత్యేక ఆఫర్లు
• పోటాపోటీగా తగ్గింపు ఇస్తున్న ఈ - కామర్స్ సంస్థలు
• దుస్తులు, వాహనాలు, ఇతర వస్తువుల కొనుగోలుపై ప్రజల ఆసక్తి



సండే మార్కెట్ వద్ద కోలాహలం

నెల్లూరు సిటీ: దసరా సందర్భంగా సింహపురిలో కొనుగోళ్ల సందడి నెలకొంది. షాపింగ్ మాళ్లు, పలు కంపెనీలతో పాటు ఈ - కామర్స్ సంస్థలు ఇస్తున్న ప్రత్యేక ఆఫర్లతో కొనుగోళ్లు ఊపందుకున్నాయి. ఎలక్ట్రానిక్స్ వస్తువులపై భారీ ఆఫర్లను అందిస్తుండటంతో ఫోన్లు, ఫ్రిజ్‌లు, టీవీలు తదితరాలను కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. విజయదశమి సందర్భంగా జిల్లాలో దాదాపు రూ.100 కోట్లకుపైగా వ్యాపారం జరుగుతుందని అంచనా.

ఆఫర్ల వరద

ప్రజలను ఆకర్షించేందుకు గానూ చిన్న దుకాణం నుంచి భారీ షాపింగ్ మాళ్ల వరకు ఆఫర్లను భారీగా ప్రవేశపెట్టారు. ఒక చీర కొంటే మరొకటి ఫ్రీ, గిఫ్ట్ ఓచర్లు, రెండు షర్ట్‌లు కొంటే రెండు షర్ట్‌లు.. ఇలా ఎన్నో ఆఫర్లను ప్రకటించారు. ఈ - కామర్స్ సంస్థలైన అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లో లభిస్తున్న పలు ఆఫర్లతో కొనుగోలు చేసేందుకు ప్రజలు ఉత్సాహం చూపుతున్నారు.

ప్రతి దసరాకు ఎలక్ట్రానిక్స్ వస్తువు కొంటా



ప్రతి దసరా పండగకు ఇంట్లో ఒక ఎలక్ట్రానిక్స్ వస్తువును కొనుగోలు చేస్తుంటాను. ఈ ఏడాది ఫ్రిజ్‌ను కొనుగోలు చేశా. దుకాణ నిర్వాహకులు మంచి ఆఫర్లు ఇస్తున్నారు. గతంతో పోలిస్తే ఇప్పుడు తగ్గింపు ధరలకు ఇస్తున్నారు. ఆన్‌లైన్లోనూ తక్కువ ధరలకే అందుబాటులో ఉన్నాయి.
– గంగాధర్, ప్రైవేట్ ఉద్యోగి

జగనన్న సంక్షేమ పథకాల పుణ్యమే



జగనన్న ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి ప్రతి పండగకు పిల్లలకు మంచి దుస్తులు, ఏదో ఒక వస్తువును కొనుగోలు చేస్తున్నాం. సంపాదనను ఇంట్లో ఖర్చులకు ఉపయోగించుకొని, కొంత మిగుల్చుకుంటున్నాం. పథకాల ద్వారా వచ్చే డబ్బులతో పండగలను సంతోషంగా జరుపుకోగలుగుతున్నాం.
– ఆవుల ప్రమీల, గాంధీగిరిజన కాలనీ

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్:	రూ.112	స్కిన్‌లెస్ చికెన్:	రూ.220
లేయర్	రూ.110	లేయర్ చికెన్:	రూ.187
బ్రాయిలర్ చికెన్:	రూ.200		

'ఐదు' ఎవరి ఖాతాలో..?

నేడు ప్రపంచకప్‌లో భారత్, న్యూజిలాండ్ పోరు

- నాలుగు విజయాలతో సమఉజ్జీలుగా ఇరు జట్లు
- గెలిచిన టీమ్ అగ్రస్థానానికి
- మ.గం.2.00నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్‌లో ప్రత్యక్షప్రసారం





కోహ్లి

ధర్మశాల: క్రికెట్ అభిమానుల కోసం మరో ఆదివారం అసలైన వినోదానికి రంగం సిద్ధమైంది. ప్రపంచకప్‌లో వరుసగా నాలుగు విజయాలతో అజేయంగా సాగుతున్న జట్లు నేడు జరిగే పోరులో ముఖాముఖీ తలపడనున్నాయి. ప్రపంచంలోని అందమైన క్రికెట్ వేదికల్లో ఒకటైన ధర్మశాలలో నేడు న్యూజిలాండ్‌తో భారత్ తలపడుతుంది. సొంతగడ్డపై సమష్టి ప్రదర్శనతో టీమిండియా చెలరేగిపోతుండగా...ఫేవరెట్‌లుగా భావించిన ఇంగ్లండ్, ఆస్ట్రేలియాలను వెనక్కి నెట్టి గత రన్నరప్ న్యూజిలాండ్ ముందుకు దూసుకొచ్చింది. పాయింట్ల పట్టికలో అగ్రస్థానాన్ని అందుకునేందుకు జరిగే ఈ పోరులో ఎవరిది పైచేయి కానుందనేది ఆసక్తికరం.

పాండ్యా స్థానంలో ఎవరు?

జోరు మీదున్న భారత్‌కు గత మ్యాచ్ తర్వాత అనూహ్య సమస్య వచ్చింది. గాయపడిన హార్దిక్ పాండ్యా ఈ మ్యాచ్‌కు దూరం కావడంతో అతని స్థానంలో ఎవరిని ఎంచుకుంటారనేది కీలకంగా మారింది. పిచ్ పరిస్థితిని బట్టి చూస్తే నేరుగా షమీకి అవకాశం దక్కవచ్చు. అయితే బ్యాటింగ్ బలహీనంగా మారే అవకాశం ఉంది. దాంతో సూర్యకుమార్ లేదా ఇషాన్ కిషన్‌లలో ఒకరికి అవకాశం దక్కుతుంది. అలా చేస్తే శార్దుల్ ఠాకూర్ పూర్తి స్థాయిలో ఐదో బౌలర్‌గా తన బాధ్యతను నిర్వర్తించాల్సి ఉంటుంది. భారత బ్యాటర్లంతా మంచి ఫామ్‌లో ఉండటం సానుకూలాంశం. రోహిత్, కోహ్లి, గిల్, రాహుల్ అద్భుత ఆటతో కొనసాగిపోతున్నారు. రోహిత్, కోహ్లి దూకుడు భారత్‌కు మరో సారి గెలుపు అవకాశాలు సృష్టించగలదు. ఇప్పటి వరకు టీమిండియాకు లోయర్ ఆర్డర్ బ్యాటింగ్‌కు పరీక్షించే అవకాశం రాలేదు. కానీ కివీస్ బౌలర్లు చెలరేగితే వారు కూడా సత్తా చాటాల్సి ఉంటుంది. బుమ్రా, సిరాజ్‌లతో పేస్ బౌలింగ్ పదునుగా ఉంది. కుల్దీప్‌ను ఒక్క ప్రత్యర్థి కూడా సమర్థంగా ఎదుర్కోలేకపోయాడు. జడేజా స్పిన్ కూడా కివీస్‌ను కట్టడి చేయగలదు.

అదే జట్టుతో...

మొదటినుంచీ కివీస్ నమ్ముకున్న సమష్టితత్వమే ఆ జట్టును గెలిపిస్తోంది. గత నాలుగు మ్యాచ్‌లలో కూడా అది కనిపించింది. ఒకరు విఫలమైతే మరొకరు ఆ బాధ్యతను తీసుకుంటున్నారు. అందుకే న్యూజిలాండ్ తుది జట్టులో ఎలాంటి మార్పులు లేకుండా బరిలోకి దిగనుంది. విలియమ్సన్, సౌతీ ఇంకా కోలుకోకపోవడంతో ఈ మ్యాచ్‌కూ దూరమయ్యాడు. కాన్వే, యంగ్ శుభారంభాలు అందిస్తుండగా రచిన్, లాథమ్ దానిని కొనసాగిస్తున్నారు. ఫిలిప్స్, చాప్‌మన్ మెరుపులు జట్టుకు భారీ స్కోరు అందిస్తున్నాయి. ఇక పేస్ బౌలింగ్ దళం చాలా పదునుగా ఉంది. బౌల్ట్, హెన్రీలను ఎదుర్కోవడం భారత్‌కు అంత సులువు కాదు. వీరితో పాటు ఫెర్గూసన్, సాన్‌ట్నర్ కూడా సత్తా చాటగలరు.

పిచ్, వాతావరణం

పిచ్‌పై కాస్త పచ్చిక ఉంటుంది. స్వింగ్, బౌన్స్‌కు మంచి అనుకూలం. పేసర్లకు సానుకూలాంశం. బ్యాటర్లు నిలదొక్కుకుంటే పరుగులు రావచ్చు. మ్యాచ్ రోజు చల్లటి వాతావరణం ఉంటుంది. వర్షసూచన లేదు.

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), గిల్, కోహ్లి, అయ్యర్, రాహుల్, జడేజా, శార్దుల్, షమీ, బుమ్రా, కుల్దీప్, సిరాజ్.

న్యూజిలాండ్: లాథమ్ (కెప్టెన్), కాన్వే, యంగ్, రచిన్, మిచెల్, ఫిలిప్స్, చాప్‌మన్, సాన్‌ట్నర్, హెన్రీ, ఫెర్గూసన్, బౌల్ట్

క్లాసెన్ కమాల్ ఇంగ్లండ్ ఢమాల్

- క్లాసెన్ మెరుపు శతకం
- జాన్సెన్ సిక్సర్ల వర్షం
- ఇంగ్లండ్‌పై 229 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికా భారీ విజయం

డిఫెండింగ్ చాంపియన్ ఆట ఇంతేనా అనిపించేలా... అటు బౌలింగ్‌లో, ఇటు బ్యాటింగ్‌లో చెత్త ప్రదర్శన చూపిస్తూ... ఇంగ్లండ్ ఘోర పరాభవాన్ని మూటగట్టుకుంది. కొత్త వ్యూహం, కీలక మార్పులతో బరిలోకి దిగి టాస్ నెగ్గిన అనుకూలతను కూడా సొమ్ము చేసుకోలేక చేతులెత్తేసింది. వన్డే వరల్డ్‌కప్‌లో టైటిల్ నిలబెట్టుకోవడానికి వచ్చిన జట్టు టి20లా 22 ఓవర్లకే ఆలౌట్ కావడమేంటి... కూన అఫ్గాన్ చేతిలో ఓడిన జట్టు ఇక ఆదమరిస్తే కురదని అన్నీ అస్త్ర శస్త్రాలకు పదును పెట్టి బలమైన ప్రత్యర్థితో సై అంటుంది. కానీ ఇంగ్లండ్ తీరు చూస్తే అస్త్ర శస్త్రాలన్నీ అటకమీద పెట్టి మైదానంలో ఏదోలా ఆడేందుకు వచ్చినట్లుగా అనిపించింది. మరో వైపు దక్షిణాఫ్రికా మాత్రం నెదర్లాండ్స్ చేతిలో ఓడిన చేదు అనుభవాన్ని మరచి కొత్త ఉత్సాహంతో బరిలోకి దిగింది. బ్యాటర్ల బాధ్యత, అందరి బౌలర్ల సమష్టి కృషి వరల్డ్‌కప్‌లో సఫారీలకు అసాధారణ విజయాన్నిచ్చింది. ఈ గెలుపులో క్లాసెన్, జాన్సెన్ జట్టు హీరోలుగా నిలిచారు.



క్లాసెన్



బట్లర్

ముంబై: ఇంగ్లండ్ డిఫెండింగ్ చాంపియన్‌లా ఆడలేదు. దక్షిణాఫ్రికాలాంటి పటిష్టమైన జట్టు చేతిలో సాదాసీదా క్రికెట్ కూనలా ఓడింది. బౌలింగ్‌లో విలాపం, బ్యాటింగ్‌లో వైఫల్యంతో ఇంగ్లండ్ చిత్తయింది. శనివారం జరిగిన ప్రపంచకప్‌లో పోరులో దక్షిణాఫ్రికా 229 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌పై ఘన విజయాన్ని నమోదు చేసింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 399 పరుగుల భారీ స్కోరు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' హెన్రిచ్ క్లాసెన్ (67 బంతుల్లో 109; 12 ఫోర్లు, 4 సిక్స్‌లు) సునామీ ఆటతో సెంచరీ సాధించగా, రీజా హెండ్రిక్స్ (75 బంతుల్లో 85; 9 ఫోర్లు, 3 సిక్స్‌లు), మార్కో జాన్సెన్ (42 బంతుల్లో 75 నాటౌట్; 3 ఫోర్లు, 6 సిక్స్‌లు), వాన్‌డర్ డసెన్ (61 బంతుల్లో 60; 8 ఫోర్లు) చెలరేగారు. హెండ్రిక్, డసెన్ 116 బంతుల్లో 121 పరుగులు జోడించగా... క్లాసెన్, జాన్సెన్ ఓవర్‌కు 12 పరుగుల రన్‌రేట్‌తో 12.5 ఓవర్లలోనే 151 పరుగులు జత చేయడం విశేషం. 61 బంతుల్లోనే క్లాసెన్ సెంచరీ పూర్తయింది. తర్వాత భారీ లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన ఇంగ్లండ్ 22 ఓవర్లు మాత్రమే ఆడి 170 పరుగులకే కుప్పకూలింది. తొమ్మిదో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన మార్క్ వుడ్ (17 బంతుల్లో 43 నాటౌట్; 2 ఫోర్లు, 5 సిక్సర్లు) తప్ప ఇంకెవరూ చెప్పుకునేంత స్కోరు, జట్టు పరువు నిలిపే పోరాటమైనా చేయలేకపోయారు. ప్రధాన బ్యాటర్లంతా విఫలం కాగా, చివర్లో వుడ్ పోరాటం ఆ జట్టు అట్టడుగునకు చేరకుండా ఆపింది. 400 పరుగుల లక్ష్యాన్ని చూడగానే భీతిల్లినట్లుగా ఇంగ్లండ్ బ్యాటింగ్ వరుస కునారిల్లింది. టాపార్డర్‌లో బెయిర్ స్టో (10), మలాన్ (6), రూట్ (2) కలిపి చేసిన స్కోరు 18 దాటలేదు. మిడిలార్డర్‌లో బ్రూక్ (17), బట్లర్ (15), విల్లీ (12) రెండంకెల స్కోర్లు చేశారంతే. టెయిలెండర్ అట్కిన్సన్ (21 బంతుల్లో 35; 7 ఫోర్లు) కొద్దిసేపు క్రీజ్‌లో నిలిచాడు. తాజా ఫలితంతో ఇంగ్లండ్ సెమీస్ అవకాశాలకు పెద్ద దెబ్బ పడింది.



జాన్సెన్

స్కోరు వివరాలు

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: డికాక్ (సి) బట్లర్ (బి) టాప్లీ 4; హెండ్రిక్స్ (బి) రషీద్ 85; డసెన్ (సి) బెయిర్‌స్టో (బి) రషీద్ 60; మార్క్‌రమ్ (సి) బెయిర్‌స్టో (బి) టాప్లీ 42; క్లాసెన్ (బి) అట్కిన్సన్ 109; మిల్లర్ (సి) స్టోక్స్ (బి) టాప్లీ 5; జాన్సెన్ నాటౌట్ 75; కోయెట్జీ (సి) సబ్-లివింగ్‌స్టోన్ (బి) అట్కిన్సన్ 3; కేశవ్ నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (50 ఓవర్లలో 7 వికెట్లకు) 399. వికెట్ల పతనం:** 1-4, 2-125, 3-164, 4-233, 5-243, 6-394, 7-398. **వికెట్ల పతనం:** 1-4, 2-125, 3-164, 4-233, 5-243, 6-394, 7-398. **బౌలింగ్:** టాప్లీ 8.5-0-88-3, విల్లీ 9-1-61-0, రూట్ 6.1-0-48-0, అట్కిన్సన్ 9-0-60-2, వుడ్ 7-0-76-0, ఆదిల్ రషీద్ 10-0-61-2.

ఇంగ్లండ్ ఇన్నింగ్స్: బెయిర్ స్టో (సి) డసెన్ (బి) ఇన్‌గిడి 10; మలాన్ (సి) డికాక్ (బి) జాన్సెన్ 6; జో రూట్ (సి) మిల్లర్ (బి) జాన్సెన్ 2; స్టోక్స్ (సి) అండ్ (బి) రబడ 5; బ్రూక్ (ఎల్బీ) (బి) కోయెట్జీ 17; బట్లర్ (సి) డికాక్ (బి) కోయెట్జీ 15; విల్లీ (సి) రబడ (బి) ఇన్‌గిడి 12; ఆదిల్ రషీద్ (సి) హెండ్రిక్స్ (బి) కోయెట్జీ 10; అట్కిన్సన్ (బి) కేశవ్ 35; వుడ్ నాటౌట్ 43; టోప్లీ ఆబ్సెంట్‌హర్ట్ ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (22 ఓవర్లలో ఆలౌట్) 170. వికెట్ల పతనం:** 1-18, 2-23, 3-24, 4-38, 5-67, 6-68, 7-84, 8-100, 9-170. **బౌలింగ్:** ఇన్‌గిడి 5-1-26-2, జాన్సెన్ 5-0-35-2, రబడ 6-1-38-1, కోయెట్జీ 4-0-35-3, కేశవ్ 2-0-27-1.

శ్రీలంకకు తొలి విజయం

- 5 వికెట్లతో నెదర్లాండ్స్‌పై గెలుపు
- రాణించిన సమరవిక్రమ

లక్నో: ప్రపంచకప్‌లో వరుసగా మూడు పరాజయాల తర్వాత ఎట్టకేలకు మాజీ చాంపియన్ శ్రీలంక ఖాతాలో తొలి గెలుపు చేరింది. గత మ్యాచ్‌లో స్ఫూర్తిదాయక ప్రదర్శనతో దక్షిణాఫ్రికాను ఓడించిన నెదర్లాండ్స్ ఈ సారి అదే జోరును కొనసాగించలేకపోయింది. శనివారం జరిగిన ఈ పోరులో లంక 5 వికెట్ల తేడాతో నెదర్లాండ్స్‌పై విజయం సాధించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన నెదర్లాండ్స్ 49.4 ఓవర్లలో 262 పరుగులకు ఆలౌటైంది. సైబ్రాండ్ ఎంగెల్‌బ్రెట్ (82 బంతుల్లో 70; 4 ఫోర్లు, 1 సిక్స్), లోగన్ వాన్ బీక్ (75 బంతుల్లో 59; 1 ఫోర్, 1 సిక్స్) అర్ధ సెంచరీలు సాధించారు. 21.2 ఓవర్లలోనే హాలండ్ 91 పరుగులకే 6 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడగా...సైబ్రాండ్, వాన్ బీక్ ఏడో వికెట్‌కు 130 పరుగులు జోడించి జట్టును ఆదుకున్నారు. లంక బౌలర్ల ధాటికి ఒక దశలో వరుసగా 20.4 ఓవర్ల పాటు డచ్ టీమ్ కనీసం ఒక్క ఫోర్ కూడా కొట్టలేకపోయింది. పేసర్లు మదుషంక, రజిత చెరో 4 వికెట్లతో ప్రత్యర్థిని దెబ్బ తీశారు. లంక 26 వైడ్‌లు సహా మొత్తం 33 ఎక్స్‌ట్రాలు ఇవ్వడం విశేషం. ఇందులో కీపర్ హెల్మెట్‌కు బంతి తగలడంతో ఇచ్చిన ఐదు పెనాల్టీ పరుగులు కూడా ఉన్నాయి. అనంతరం లంక 48.2 ఓవర్లలో 5 వికెట్లకు 263 పరుగులు సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సదీర సమరవిక్రమ (107 బంతుల్లో 91 నాటౌట్; 7 ఫోర్లు) చివరి వరకు నిలబడి జట్టును గెలిపించగా...పతుమ్ నిసాంక (52 బంతుల్లో 54; 9 ఫోర్లు), చరిత్ అసలంక (66 బంతుల్లో 44; 2 ఫోర్లు, 1 సిక్స్), ధనంజయ డిసిల్వ (37 బంతుల్లో 30; 1 ఫోర్, 2 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు.



స్కోరు వివరాలు:

నెదర్లాండ్స్ ఇన్నింగ్స్: విక్రమ్‌జిత్ (ఎల్బీ) (బి) రజిత 4; మ్యాక్స్ ఒ డౌడ్ (బి) రజిత 16; అకెర్‌మన్ (సి) మెండిస్ (బి) రజిత 29; డి లీడ్ (సి) పెరీరా (బి) మదుషంక 6; తేజ (ఎల్బీ) (బి) మదుషంక 9; ఎడ్వర్డ్స్ (బి) తీక్షణ 16; సైబ్రాండ్ (బి) మదుషంక 70; వాన్‌బీక్ (సి) అసలంక (బి) రజిత 59; వాండర్‌మెర్వ్ (సి) మెండిస్ (బి) మదుషంక 7; ఆర్యన్ దత్ (నాటౌట్) 9; మీకెరెన్ (రనౌట్) 4; ఎక్స్‌ట్రాలు 33; **మొత్తం (49.4 ఓవర్లలో ఆలౌట్) 262. వికెట్ల పతనం:** 1-7, 2-28, 3-54, 4-68, 5-71, 6-91, 7-221, 8-244, 9-252, 10-262. **బౌలింగ్:** మదుషంక 9.4-1-49-4, రజిత 9-0-50-4, కరుణరత్నే 9-1-58-0, తీక్షణ 10-0-44-1, హేమంత 8-0-42-0, ధనంజయ 4-0-13-0.

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (సి) ఎడ్వర్డ్స్ (బి) మీకెరెన్ 54; పెరీరా (సి) డి లీడ్ (బి) దత్ 5; మెండిస్ (సి) మీకెరెన్ (బి) దత్ 11; సమరవిక్రమ (నాటౌట్) 91; అసలంక (బి) దత్ 44; ధనంజయ (బి) అకెర్‌మన్ 30; హేమంత (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 24; **మొత్తం (48.2 ఓవర్లలో 5 వికెట్లకు) 263. వికెట్ల పతనం:** 1-18, 2-52, 3-104, 4-181, 5-257. **బౌలింగ్:** ఆర్యన్ దత్ 10-0-44-3, వాన్ బీక్ 10-0-57-0, మీకెరెన్ 8-1-39-1, డి లీడ్ 3-0-29-0, వాన్‌డర్ మెర్వ్ 9-0-42-0, అకెర్‌మన్ 8.2-0-39-1.

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
న్యూజిలాండ్	4	4	0	8	1.923
భారత్	4	4	0	8	1.659
దక్షిణాఫ్రికా	4	3	1	6	2.212
ఆస్ట్రేలియా	4	2	2	4	-0.193
పాకిస్తాన్	4	2	2	4	-0.456
బంగ్లాదేశ్	4	1	3	2	-0.784
నెదర్లాండ్స్	4	1	3	2	-0.790
శ్రీలంక	4	1	3	2	-1.048
ఇంగ్లండ్	4	1	3	2	-1.248
అఫ్గానిస్తాన్	4	1	3	2	-1.250

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

నేటి నుంచి పారా ఆసియా క్రీడలు

- వారం పాటు ఈవెంట్
- 313 మందితో భారత బృందం



హాంగ్జౌ: ఇటీవల ఇక్కడే జరిగే ఆసియా క్రీడల్లో ముందెన్నడు లేని విధంగా రికార్డు స్థాయిలో పతకాలు సాధించిన భారత బృందంలాగే పారా అథ్లెట్లు కూడా గంపెడాశలతో పారా ఆసియా క్రీడలకు సిద్ధమయ్యారు. ఆదివారం నుంచి ఈ నెల 28 వరకు జరుగనున్న ఈ పోటీల్లో భారత దివ్యాంగ అథ్లెట్లు సత్తాచాటాలని గట్టి పట్టుదలగా ఉన్నారు. గత టోక్యో పారాలింపిక్స్‌లో స్వర్ణ పతకాలు సాధించిన అవని లేఖరా, సుమిత్ అంటిల్‌లు భారత బృందాన్ని ముందుండి నడిపించనున్నారు. టోక్యోలో 2021లో జరిగిన మెగా ఈవెంట్‌లో స్టార్ షూటర్ అవని బంగారంతో పాటు కాంస్యం గెలిచింది. జావెలిన్ త్రోయర్ అంటిల్ కూడా పసిడి పట్టాడు. వీరితో పాటు పతకం ఆశలున్న పారా షూటర్ మనీశ్ నర్వాల్, షట్లర్లు ప్రమోద్ భగత్, కృష్ణ నగర్‌లు సహా మొత్తం 313 మందితో కూడా భారత పారా అథ్లెట్ల బృందం హాంగ్జౌలో పతకాల వేట మొదలుపెట్టేందుకు సై అంటోంది. మొత్తం 22 క్రీడాంశాలు నిర్వహిస్తుండగా భారత అథ్లెట్లు 17 క్రీడాంశాల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. సరిగ్గా వారం రోజుల పాటు జరిగే ఈ పారా మెగా ఈవెంట్‌లో 43 దేశాలకు చెందిన సుమారు 4000 మంది అథెట్లు పోటీపడనున్నారు. 22 క్రీడాంశాల్లో 566 గోల్డ్ మెడల్ ఈవెంట్లు న్నాయి. తొలిసారిగా 2010లో గ్వాంగ్‌జౌలో పారా ఆసియా క్రీడలు జరిగాయి. ఇందులో భారత బృందం 14 పతకాలు సాధించి 15వ స్థానంలో నిలిచింది. 2018లో జరిగిన గత పారా ఈవెంట్‌లో భారత అథ్లెట్లు మొత్తం 72 పతకాలు సాధించి టాప్-10లో తొమ్మిదో స్థానంలో నిలిచారు. ఈ సారి పతకాల సెంచరీ మార్కు దాటించేందుకు భారత అథ్లెట్లు తీవ్రంగా శ్రమిస్తున్నారు. షూటింగ్‌లో క్రితం సారి మూడు పతకాలే వచ్చాయి. అయితే అవని జకార్తా (2018) ఈవెంట్‌లో ఆడలేదు. ఇప్పుడు స్టార్ షూటర్ అందుబాటులో ఉండటంతో షూటింగ్‌లోనూ పతకాల సంఖ్య ఆశించినంత పెరగొచ్చు.

మళ్లీ మరీన్ చేతిలో...

పీవీ సింధుకు మరో పరాజయం

ఒడెన్స్: పీవీ సింధు, కరోలినా మరీన్ మధ్య మంచి స్నేహం ఉంది. కోర్టులో ప్రత్యర్థులే అయినా కోర్టు బయట తమ సాన్నిహిత్యం గురించి వీరిద్దరు చాలా సార్లు చెప్పుకున్నారు. కానీ శనివారం ఇద్దరి మధ్య జరిగిన హోరాహోరీ పోరు అనూహ్య రీతిలో సాగింది. ఒక దశలో ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ప్రత్యర్థిపై పైచేయి సాధించే క్రమంలో అరుపులు, కేకలతో పాటు పలు మార్లు ఇద్దరూ అంపైర్ల హెచ్చరికకు కూడా గురయ్యారు. అయితే చివరకు 73 నిమిషాల సమరం తర్వాత భారత షట్లర్ పరాజయం పక్షానే నిలిచింది. ఈ మ్యాచ్‌కు ముందు ముఖాముఖీ రికార్డులో సింధు 5-10తో వెనుకబడి ఉండగా, ఇప్పుడు అది 5-11కు చేరింది. బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సూపర్-750 టోర్నీ డెన్మార్క్ ఓపెన్ సెమీ ఫైనల్లో సింధు ఓటమిపాలైంది. కరోలినా మరీన్ (స్పెయిన్) 21-18, 19-21, 21-7 స్కోరుతో సింధుపై విజయం సాధించింది.

ఇద్దరు ప్లేయర్లు తమదైన శైలిలో చెలరేగడంతో తొలి గేమ్ దాదాపు సమంగా సాగింది. విరామ సమయంలో సింధు 11-10తో ఒక పాయింట్ ముందంజలో ఉంది. ఆ తర్వాతా ఇదే కొనసాగి స్కోరు 18-18కి చేరింది. అయితే మరీన్ వరుసగా మూడు పాయింట్లు గెలుచుకొని గేమ్‌ను తన ఖాతాలో వేసుకుంది. రెండో గేమ్‌లో మాత్రం సింధు దూసుకుపోయింది. చకచకా పాయింట్లు సాధించిన ఆమె ఎక్కడా ఆధిక్యం తగ్గనీయకుండా 11-3కు చేరింది. అయితే ఆ తర్వాత ప్రతిఘటించిన మరీన్ వరుసగా పాయింట్లు గెలుచుకొని అంతరాన్ని తగ్గించింది. సింధు 20-16తో ముందంజలో నిలిచిన తర్వాత మరీన్ వరుసగా మూడు పాయింట్లు గెలవడంతో 20-19గా మారింది. కానీ స్మాష్‌తో పాయింట్ సాధించి సింధు గేమ్ గెలుచుకుంది. చివరి గేమ్ మాత్రం పూర్తి ఏకపక్షంగా మారిపోయింది. మరీన్ జోరు ముందు భారత షట్లర్ నిలవలేకపోయింది. ముందు 3-0, ఆపై 3-2...ఆ తర్వాత ఆమె జోరు సాగిపోయింది. వరుసగా 11 పాయింట్లు సాధించిన మరీన్ 14-2 దాకా వెళ్లింది. అనంతరం మ్యాచ్‌ను ముగించేందుకు ఆమెకు ఎక్కువ సమయం పట్టలేదు.



మరీన్ అరుపులు... సింధు అసహనం

పాయింట్లు సాధించినప్పుడు అతిగా భావోద్వేగాలు ప్రదర్శించవద్దని అంపైర్ ఇద్దరినీ పిలిచి మ్యాచ్‌లో పలు మార్లు వారించాడు. అయితే మరీన్ తన అరుపులను ఆపకపోగా, సర్వీస్ అందుకునేందుకు సింధు ఎక్కువ సమయం తీసుకుంది. తొలి గేమ్‌ను మరీన్‌ను మళ్లీ అంపైర్ హెచ్చరించాడు. మూడో గేమ్‌లో సర్వీస్ ఆలస్యానికి సింధును అంపైర్ ప్రశ్నించగా...' ఆమె అరిచేందుకు అవకాశమిచ్చారు కదా. ముందు ఆమెను ఆపమని చెబితే నేనూ సిద్ధంగా ఉంటా' అని సింధు బదులిచ్చింది. మరొకరి కోర్టునుంచి షటిల్ తీసుకోవద్దని ఇద్దరికీ చెప్పాల్సి వచ్చింది. చివరకు అంపైర్ ఇద్దరికీ 'ఎల్లో కార్డు'లు కూడా చూపించాల్సి వచ్చింది.

సినిమా



● ఈషా డియోల్, హేమా మాలిని, రాణీ ముఖర్జీ



● కాజోల్

సరదా.. దసరా..



● దులారీ ఖేర్, అనుపమ్ ఖేర్

బాలీవుడ్‌లో దసరా సందడి జోరు బాగా కనిపిస్తోంది. ప్రతి ఏడాదీ కొందరు స్టార్స్ ప్రముఖ ఏరియాల్లో అమ్మవారిని ప్రతిష్ఠించే చోటుకి వెళ్లి, పూజలు చేస్తుంటారు. ముఖ్యంగా కాజోల్, రాణీ ముఖర్జీ తప్పకుండా వెళుతుంటారు. ఈ ఏడాది కూడా ఈ ఇద్దరూ అమ్మవారిని దర్శించుకున్నారు. కాజోల్ తన తనయుడు యుగ్‌తో కలిసి వెళ్లారు. ఇంకా హేమా మాలిని, ఆమె కుమార్తె ఈషా డియోల్ తన తల్లి దులారీ ఖేర్‌తో కలిసి అనుపమ్ ఖేర్ తదితరులు దుర్గా మాత ఆశీస్సులు అందుకున్నారు.

సరిపోదా శనివారం?



● నాని

'అంటే సుందరానికీ' చిత్రం తర్వాత హీరో నాని, దర్శకుడు వివేక్ ఆత్రేయ కాంబినేషన్‌లో మరో సినిమా తెరకెక్కనుంది. ఈ చిత్రంలో ప్రియాంకా అరుళ్ మోహన్ హీరోయిన్. డీవీవీ ఎంటర్‌టైన్మెంట్స్‌పై డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి ఈ సినిమాను నిర్మించనున్నారు. ఈ చిత్రాన్ని శనివారం ప్రకటించారు. అలాగే ఈ నెల 23న ఓ అప్‌డేట్, 24న ఈ సినిమా ప్రారంభోత్సవం జరపనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. ఈ చిత్రానికి 'సరిపోదా శనివారం' అనే టైటిల్ అనుకుంటున్నారని సమాచారం.

మేడమ్ అని కాకుండా సార్ అని పిలిచారు

- దర్శకురాలు పూజ

సంపూర్ణేష్ బాబు ప్రధాన పాత్రలో వీకే నరేశ్, శరణ్య కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'మార్టిన్ లూథర్ కింగ్'. పూజా కొల్లూరు దర్శకత్వంలో వైనాట్ స్టూడియోస్, రిలయన్స్ ఎంటర్‌టైన్‌మెంట్ సమర్పణలో మహాయాన మోషన్ పిక్చర్స్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 27న విడుదల కానుంది. ఈ సందర్భంగా శనివారం విలేకర్ల సమావేశంలో పూజా కొల్లూరు మాట్లాడుతూ– ''సైంటిస్ట్ లేదా ఐఏఎస్ ఆఫీసర్ కావాలనుకున్నప్పటికీ సినిమాతో సమాజాన్ని ప్రభావితం చేయవచ్చని సినిమా రంగాన్ని కెరీర్‌గా ఎంచుకున్నాను. తెలుగులో 'మార్టిన్ లూథర్ కింగ్' నా తొలి సినిమా. కానీ ఈ చిత్రం కంటే ముందు కొన్ని హాలీవుడ్ ప్రాజెక్ట్స్‌తో అసోసియేషన్ ఉంది. కొన్ని డాక్యుమెంటరీలు తీశాను. ఇక 'మార్టిన్ లూథర్ కింగ్' విషయానికి వస్తే.. వై నాట్ స్టూడియోస్ సంస్థ తమిళ చిత్రం 'మండేలా' కథను తెలుగులో చెప్పాలనుకుని, వెంకటేశ్ మహాగారిని సంప్రదించారు. అయితే నిర్మాణంలో భాగమౌతానని, దర్శకత్వం వహించలేనని ఆయన చెప్పారు. దీంతో నేను దర్శకత్వం వహిస్తానని వెంకటేశ్ మహాగారికి చెప్పడంతో ఆయన వారికి చెప్పారు. ఓటర్లు వారి ఓటు హక్కును ఎందుకు వినియోగించుకోవాలన్నది ఈ సినిమా థీమ్. ఓ సామాన్యుడు నటిస్తే ఎలా ఉంటుందో అలా ఉండాలని సంపూర్ణేష్‌ని హీరోగా తీసుకోవడం జరిగింది. వెంకటేశ్ మహా ఈ చిత్రానికి స్క్రీన్‌ప్లే, డైలాగ్స్ ఇచ్చారు. నేను ఎడిటింగ్ కూడా చేశాను'' అన్నారు. ఇంకా మాట్లాడుతూ– ''ఏ భాషలోనైనా మహిళలకు అవకాశాలు తక్కువగానే ఉంటున్నాయి. నేను లేడీ డైరెక్టర్‌ని అయినా సెట్స్‌లో చాలాసార్లు ఓకే సార్ అన్నారు కానీ మేడమ్ అనలేదు. అంటే లింగ వివక్ష ఎంతలా నాటుకుపోయిందో అర్థం చేసుకోవచ్చు. సమస్య లున్నప్పటికీ మన పట్టుదలే మనల్ని ముందుకు నడిపిస్తుంది'' అని చెప్పుకొచ్చారు.





● నందిత, స్వాతి, అజయ్ భూపతి, కార్తికేయ, పాయల్, అజ్మల్, సురేష్ వర్మ

మంగళవారం కోసం ఎదురు చూస్తున్నా!

- హీరో కార్తికేయ

''ఆర్‌ఎక్స్ 100' తర్వాత నేను, అజయ్ భూపతి లేదా నేను, పాయల్ ఎప్పుడు మళ్లీ సినిమా చేస్తామని అందరూ అడుగుతుంటే.. మంచి కథ కుదరాలని చెబుతూ వచ్చాను. వారిద్దరి కాంబినేషన్‌లో 'మంగళవారం' సినిమా చేస్తున్నట్లు వార్తలు చూసి, నన్ను వదిలేసి ఇద్దరూ సినిమా చేశారు అనుకున్నా (నవ్వుతూ). అజయ్ తన సొంతూరు ఆత్రేయపురంలో 'ఆర్‌ఎక్స్ 100' తీశాడు. ఇప్పుడు ఆ ఊరిని మరో విధంగా 'మంగళవారం'లో చూపించాడు. 100 పర్సెంట్ అందరికంటే ఈ సినిమా కోసం నేనెక్కువ ఎదురు చూస్తున్నాను'' అని హీరో కార్తికేయ అన్నారు. పాయల్ రాజ్‌పుత్, అజ్మల్ ఆమిర్ జంటగా అజయ్ భూపతి దర్శకత్వం వహించిన చిత్రం 'మంగళవారం'. స్వాతీ రెడ్డి గునుపాటి, సురేష్ వర్మ .ఎం నిర్మించిన ఈ సినిమా నవంబర్ 17న విడుదల కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ని హీరో చిరంజీవి సోషల్ మీడియా ద్వారా విడుదల చేశారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో హీరో కార్తికేయ ట్రైలర్‌ని రిలీజ్ చేశారు. అజయ్ భూపతి మాట్లాడుతూ– ''మంగళవారం' మంచి డార్క్ థ్రిల్లర్. ఇందులో మహిళలకు సంబంధించిన పాయింట్‌ని టచ్ చేశాం. కార్తికేయ, నా కాంబినేషన్‌లో మరో సినిమా ఉంటుంది'' అన్నారు. ''మా నాన్నకు (నిమ్మగడ్డ ప్రసాద్), నాకు సినిమాలంటే ఇష్టం. సినిమా నిర్మించాలనే నా కల 'మంగళవారం'తో నెరవేరింది'' అన్నారు స్వాతీ రెడ్డి. ''ఈ సినిమాతో నేను, స్వాతి నిర్మాతలుగా పరిచయమవడం గర్వంగా ఉంది'' అన్నారు సురేష్ వర్మ. ''నా కెరీర్ ఎటు వెళుతుందో తెలియని అనిశ్చితి ఉన్న సమయంలో 'మంగళవారం'కి చాన్స్ ఇచ్చారు అజయ్‌గారు'' అన్నారు పాయల్.

యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్



● పూజిత, విరాజ్

'బేబి' సినిమా ఫేమ్ విరాజ్ అశ్విన్ హీరోగా నటించిన చిత్రం 'జోరుగా హుషారుగా'. అను ప్రసాద్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో పూజిత పొన్నాడ కథానాయిక. నిరీష్ తిరువీధుల నిర్మించారు. ఈ చిత్రం టీజర్‌ను నిర్మాతలు కేఎల్ దామోదర్ ప్రసాద్, బెక్కం వేణుగోపాల్, దర్శకుడు కృష్ణ చైతన్య, పలువురు పాత్రికేయులు విడుదల చేశారు. అను ప్రసాద్ మాట్లాడుతూ– ''యూత్‌ఫుల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'జోరుగా హుషారుగా'. యువ తరానికి నచ్చే అంశాలతో అన్ని భావోద్వేగాలతో రూపొందించిన చిత్రం ఇది. కొత్తదనం ఆశించే ప్రేక్షకులకు కచ్చితంగా నచ్చుతుంది''అన్నారు.